ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
శుక్రవారం 11 ఏప్రిల్ 2025

వైభవంగా రామచంద్రస్వామి రథోత్సవం

బీర్‌పూర్,ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామంలో గురువారం రామచంద్రస్వామి రతోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులను వేదపండితులు అందంగా అలంకరించిన రథంపై ఉంచారు. అనంతరం రథోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ రథోత్సవాన్ని తిలకించేందుకు పొరుగు మండలాల నుంచి, ఇతర గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ రథోత్సవం కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆయా పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వస్తున్నాం..అంజన్నా..

కొండగట్టు దేవాలయం

- నేటి నుంచి హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు
- కొండగట్టులో మూడు రోజుల పాటు వేడుకలు
- తరలిరానున్న లక్షలాది భక్తులు

7

చిన్నారులకు వైద్యపరీక్షలు

- అంగన్‌వాడీల్లో కంటి, మానసిక సమస్యల గుర్తింపు
- ఆర్‌బీఎస్‌కే ద్వారా నాలుగు వైద్య బృందాల ఏర్పాటు
- మూడు నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యం
- జిల్లాలో 64,297 మంది చిన్నారులు



అంగన్‌వాడీ చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

జగిత్యాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సంక్షేమశాఖ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరేళ్లలోపు చిన్నారులకు కంటి సమస్యలు, మానసిక సమస్యలు గుర్తించేందుకు పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఈనెల 7న వైద్యపరీక్షలు ప్రారంభించగా మూడునెలల పాటు కొనసాగించనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 0-6ఏళ్లలోపు చిన్నారులు పౌష్టికాహారం పొందుతూ చదువుకుంటున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అత్యధికంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేది పేద, మధ్య తరగతి వర్గాల పిల్లలే. ఆయా పిల్లలు సరైన పర్యవేక్షణ లేక కంటి, మానసిక సమస్యలను ఎదుర్కొనే అవకాశముంది. ఈ సమస్యలు చిన్న తనంలోనే గుర్తించి సరిచేసేందుకు ప్రభుత్వం వైద్య పరీక్షలకు శ్రీకారం చుట్టింది. ఇదివరకే రాష్ట్రీయ బాల్‌స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ద్వారా ఒకటోతరగతి నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు రెండు విడతలుగా కంటి పరీక్షలను పూర్తి చేశారు. మూడో విడతగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు పరీక్షలు చేయనున్నారు.

● పరీక్షలు ఇలా....

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు. సబ్ సెంటర్ల వైద్య సిబ్బందితో పాటు ఆప్తాల్మిక్ నిపుణులు చిన్నారులకు కంటి పరీక్షలను నిర్వహిస్తారు. చిన్నారుల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ టీచర్‌ను భాగస్వాములను చేస్తూ చిన్నారులకు ప్రత్యేకంగా బొమ్మలతో రూపొందించిన చార్ట్ చూపిస్తూ ప్రశ్నించనున్నారు. దీంతో చూపుసరిగా ఉన్నదీ... లేనిదీ నిర్ధారించనున్నారు. చిన్నారులకు కంటిలో ఏమైనా మచ్చలున్నాయా, దృష్టితో పాటు, మెల్ల కన్ను, కార్నియా సమస్యలు, నిర్ధారిత దిశలో కళ్లు చూడక పోవడం, కళ్లల్లో తగినంత తేమ లేకపోవడం... పొడి బారుతుందా తదితర విషయాలపై ఆప్తాలిక్ నిపుణులు పరీక్షించనున్నారు. కంటి సమస్యలున్న చిన్నారులకు బోధనాసుపత్రుల్లో తగిన చికిత్సలు అందిస్తారు. మానసిక సమస్యలపై పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది పరీక్షలు నిర్వహించనున్నారు. చిన్నారుల ఎదుగుదల, ఎత్తు, బరువు, మాటలు సరిగా వస్తున్నాయా, లేదా ఆయా వస్తువులను గుర్తిస్తున్నారా...లేదా ప్రవర్తనల్లో ఏమైనా మార్పులున్నాయా అనే అంశలను కూడా వైద్యులు అడిగి తెలుసుకుంటారు.

జిల్లాలో 1,065 అంగన్‌వాడీ కేంద్రాలు

జిల్లాలోని 1,065 అంగన్‌వాడీ కేంద్రాల్లో 0-6 సంవత్సరాల్లోపు వయస్సుగల చిన్నారులు 64, 297 మంది ఉన్నారు. ఇందులో ఇప్పటివరకు 891 మందికి పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్య ఉన్న వారిని గుర్తించి చికిత్స అందిస్తున్నారు. గతంలో ఆర్‌బీఎస్‌కే కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 2,474 మంది కంటి సమస్య ఉన్న విద్యార్థులను గుర్తించి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు.

పకడ్బందీగా వైద్య పరీక్షలు



అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు కంటి, మానసిక ఎదుగుదలపై పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. ఈనెల నుంచి చిన్నారులకు వైద్య పరీక్షలను ప్రారంభించాం. విద్యార్థులందరికీ పూర్తయ్యే వరకు సుమారు మూడు నెలల పాటు పరీక్షలు నిర్వహిస్తాం.

-డాక్టర్ బోనగిరి నరేశ్,
జిల్లా సంక్షేమశాఖ అధికారి

ధర్నాను విజయవంతం చేయాలి

కోరుట్లరూరల్, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవ రణ చట్టాన్ని రద్దు చేయాలని హైదరా బాద్‌లో ఈనెల 13న తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని మర్కజీ ఇంతెజామి మిల్లాత్ ఇస్లామియా కమిటీ మాజీ అధ్యక్షుడు మహ్మద్ ఖుతబోద్దిన్ పాషా పిలుపునిచ్చారు. గురువారం మెట్‌పల్లి పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కమిటీ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ వద్ద ఉన్న నిర్వహిస్తున్న మహా ధర్నాలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కమిటీ సభ్యులు సల్మాన్‌ఖాన్, షేక్ షాహిద్, సయ్యద్, సిరాజుద్దిన్, మహ్మద్ రిజ్వాన్‌లు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

గొల్లపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లె లోని జిల్లా పరిసత్ ఉన్నత పాఠశాల నుంచి చౌడలమ్మ ఆలయం వరకు రూ.5 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం పనులను ఏఎంసీ వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శనిగారపు మల్లేశం, మాజీ ఎంపీటీసీ లంబ ధనవ్వ లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి రాజకిషన్, నాయకులు రాజిరెడ్డి, రమేష్ రెడ్డి, మహేష్, పాఠశాల ప్రధానో పాధ్యాయులు మొగిలి రవి తదితరులు పాల్గొన్నారు.

వీవోఏలకు శిక్షణ

కథలాపూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు, పుస్తకాల నిర్వహణ గురించి ఏపీఎం నరహరి వీవోఏలకు గురువారం శిక్షణ ఇచ్చారు. స్త్రీశక్తి భవనంలో ప్రత్యేకంగా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. రైతుల ధాన్యం నంబర్ల వారీగా తూకం వేయడం, వెంటనే ఆన్‌లైన్ చేసి కేంద్రానికి కేటా యించిన రైస్‌మిల్లుకు ధాన్యం తరలించే పనులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీలు విజయలక్ష్మి, తెడ్డు అంజయ్య, అశోక, రాజేందర్ ఉన్నారు.

వంట గ్యాస్ ధరలు తగ్గించాలని ధర్నా



గ్యాస్ సిలెండర్‌తో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కోరుట్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించి వెంటనే పేదలను ఆదుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో వంట గ్యాస్ సిలిండర్‌తో ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు బాగా తగ్గాయని పేర్కొన్నారు. అయినా కేంద్ర ప్రభుత్వం సిలిండర్‌పై రూ. 50 పెంచాలని ఉత్వర్వులు జారీ చేయడం సరి కాదన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

వైద్యులు సమయపాలన పాటించాలి

● కలెక్టర్ బి.సత్యప్రసాద్



ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

ధర్మపురి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వైద్యులు సమయ పాలన పాటించాలని కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆదేశించారు. ధర్మపురి మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ సీహెచ్‌సీలో ఓపీ సేవలు, ఐసీ సేవలు, రికార్డ్స్, ల్యాబ్ రికార్డ్స్, ఐపీ రికార్డ్స్, మెడికల్ ఫార్మసీ పరిశీలించారు. ఆసుపత్రిలో అందించే వైద్య సేవల గురించి నేరుగా పేషంట్లను అడిగి ఆయన తెలుసుకున్నారు. ఆరోగ్య మహిళా కేంద్రంలో భాగంగా ప్రతి మంగళవారం మహిళలకు ఉచితంగా అందించే ఆరు రకాల వైద్య పరీక్షలు ఎంత మందికి ఎలా చేస్తున్నారని డాక్టర్లను అడిగి ఆయన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి పైన భవనం రూ2 కోట్లతో నిర్మిస్తున్న పనులపై ఆరా తీశారు. పనులను రెండు నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఆసుపత్రి ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్‌డీవో మదుసూదన్, తహసీల్దార్ కృష్ణచైతన్య, ఎంపీడీవో రవీందర్, డీసీహెచ్ఎస్ రామకృష్ణ, హెల్త్ సూపరింటెండెంట్ రవి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ తనిఖీ

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని కొత్త బస్టాండ్‌ను గురువారం ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోలోమన్ తనిఖీ చేశారు. గురువారం చేరుకున్న ఆయన బస్టాండ్‌లో ప్రయాణీకులకు కల్పిస్తున్న సౌకర్యాలను డిపో మేనేజర్ కల్పనను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రీజనల్ మేనేజర్ బి.రాజు ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు

పెగడపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం సమకూరుతుందని మండల ఉద్యానశాఖ అధికారి స్వాతి పేర్కొన్నారు. గురువారం పెగడపల్లి మండలం ఆరవెల్లిలో ఆయిల్ పామ్ సాగుపై అవ గాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసా యాధికారి శ్రీకాంత్, ఏఈఓ పవన్ పాల్గొన్నారు.

ఘనంగా వీర హనుమాన్ శోభాయాత్ర



ధర్మపురిలో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

ధర్మపురి, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): ధర్మపురిలో భజరంగ్‌దళ్ సభ్యుల ఆధ్వర్యంలో వీర హనుమాన్ శోభాయాత్ర గురువారం నిర్వహించారు. ఈ శోభాయాత్ర స్థానిక శివాజీ విగ్రహం నుంచి ప్రారంభమై కమలాపూర్ చౌరస్తా, వివేకానందచౌక్, ముదిరాజ్ వాడ, బ్రాహ్మణ సంఘం, దేవాలయం, గోదావరి రోడ్, బోయ వాడ, నంది చౌక్, గాంధీ చౌక్ మీదుగా ఆంజనేయ స్వామి విగ్రహం వరకు కొనసాగింది. శోభాయాత్రలో పది అడుగుల భారీ విగ్రహంతో భజరంగ్ దళ్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు బోయిని పద్మాకర్, భజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ కల్లెడ రోహిత్‌కుమార్ మాట్లాడుతూ హిందువులు ఐక్యంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు బోయిని పద్మాకర్, భజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ కల్లెడ రోహిత్‌కుమార్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దామెర రాంసుధాకర్ రావు, బుగ్గారం మాజీ జడ్పీటీసీ బాదినేని రాజేందర్, నిర్వాహకులు కస్తూరి రాజన్న, అల్లం దుర్గప్రసాద్, ఎలగుందుల బుచ్చన్న, వెలగందుల రవి, గాదె లక్ష్మణ్ పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి ఉత్సవ కమిటీ నియామకం

మల్యాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు జరిగే చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాల కోసం ప్రభుత్వం ఉత్సవ కమిటీని నియమిం చింది. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచనల మేరకు 12మంది సభ్యులతో దేవాదాయ కమిషనర్ కమిటీ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో చైర్మన్‌గా ఎప్ప శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులుగా కర్ర బాపురెడ్డి, వేముల అంజయ్య, కంచర్ల లక్ష్మణాచారి, వెల్మ లక్ష్మారెడ్డి, సంత ప్రకాష్‌రెడ్డి, జమలాపురి రాజేశ్వరీ, అనుమండ్ల అజయ్, కొండూరి రాజేశ్, మామిడి దిలీప్, తడగొండ హన్మంతు, వరాల నర్సింగం నియమితులయ్యారు. కాగా గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవ కమిటి సభ్యులుగా బాధ్యతలు చేపట్టారు. ఈవో శ్రీకాంత్‌రావు, అధికారులు సభ్యులను సత్కరించి అభినందించారు. మూడు రోజుల పాటు ఈ కమిటీ భక్తులకు సేవలందించనుంది.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



ధాన్యం కొనుగోళ్ల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 10 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతులను ఇబ్బందులు పెట్టకుండా ధాన్యం కొనుగోళ్లను చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. గురువారం మెట్‌పల్లి మండలంలోని రామ లచ్చక్కపేట, ఆత్మనగర్, ఆత్మకూర్, మెట్లచిట్టాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోళ్ల కేంద్రాలను మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కూన గోవర్ధన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు శ్రమించి పండించిన పంటలను దళారులకు విక్రయించి నష్టపోవద్దన్నారు. వేసవి దృష్ట్యా కేంద్రాల్లో ధాన్యం విక్రయించడానికి వచ్చిన రైతులకు తాగునీరు, నీడ వసతులు కల్పించాలన్నారు. కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయాలని అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, ఎల్ఎస్‌సీఎస్ చైర్మన్ కేసిరెడ్డి నవీన్‌రెడ్డి, మాజీ సర్పంచులు చౌటుపల్లి లావణ్య-అంజయ్య, ఆకుల రాజారెడ్డి, బద్దం శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఏవో దీపిక, ఏపిఎం విమోచన, నాయకులు, నిర్వహకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

'ముంపునకు గురవుతున్న భూములను గుర్తించాలి'



రికార్డులు పరిశీలిస్తున్న అటవీ అధికారులు

బీర్‌పూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రోళ్లవాగు ప్రాజెక్టుతో ముంపునకు గురవుతున్న అటవీ భూములను, చెట్లను గుర్తించాలని సెంట్రల్ చీఫ్ కన్జర్వేటర్ నిర్మల్ సర్కిల్ అధికారి సి.సరవనన్ అన్నారు. గురువారం బీర్‌పూర్ మండలంలోని రోళ్లవాగు ఆధునీకరణలో ముంపునకు గురవుతున్న అటవీ భూములను, చెట్లను పరిశీలించారు. గతంలో ఇరిగేషన్ అధికారులు జగిత్యాల డీఎఫ్‌వోకు 816 ఎకరాల అటవీ భూమి, 53 వేల చెట్లు ముంపునకు గురవుతున్నాయని నివేదికలు పంపారు. ముంపునకు గురవుతున్న అటవీ భూమికి బదులుగా పెగడపల్లి మండలంలోని నంచర్ల, దేవికొండలో కొన్ని ఎకరాలు, గొల్లపల్లి మండలంలోని దట్నూర్, చందోళిలో కొన్ని ఎకరాల భూములను కేటాయిస్తున్నట్లు ప్రతిపా దనలు పంపారు. వాటిని డీఎఫ్‌వో సెంట్రల్ చీఫ్ కన్జర్వేటర్‌కు పంపించారు. అందులో పేర్కొన్న ప్రకారమే నష్టం జరుగుతుందా అంతకంటే ఎక్కువ అటవీ భూమి ముంపునకు గురవుతున్నాయా అని సెంట్రల్ చీఫ్ కన్జర్వేటర్ నిర్మల్ సర్కిల్ అధికారి సి.సరవనన్ గురువారం పరిశీలించారు.

పూర్తి తదుపరి నివేదికను ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్‌కు పంపనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం మొదటిసారిగా బీర్‌పూర్ రోళ్లవాగు ప్రాజెక్టును సందర్శించిన ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్‌ను ఇరిగేషన్ అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో రవిప్రసాద్, ఎస్సారెస్పీ డీఈ చెక్రు నాయక్, జగిత్యాల ఎఫ్ఆర్‌వోలు పద్మరావ్, దేవాదాసు, ధర్మపురి ఎఫ్ఆర్‌వో శ్రీనాథ్, తుంగూర్ సెక్షన్ అధికారి గంగారాం, మంగేళ సెక్షన్ అధికారి ప్రకాష్, బీట్ ఆఫీసర్లు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఇండియన్ ఓపెన్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



సీహెచ్ పూజ

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఓపెన్ అథ్లెటిక్స్‌పోటీలకు జిల్లాకు చెందిన అథ్లెటిక్ క్రీడాకారిణి సీహెచ్ పూజ ఎంపికైంది. జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో ఈ నెలలో జరగనున్న ఇండియన్ ఓపెన్ అథ్లెటిక్స్‌పోటీల్లో పూజ తెలంగాణ రాష్ట్ర జట్టునుంచి ప్రాతినిధ్యం వహించనుంది. ఈ నెలలో జరిగిన జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో లాంగ్‌జంప్ విభాగంలో విశేష ప్రతిభచాటి ఏడోస్థానం సాధించి సీనియర్‌మహిళల విభాగంలో జిల్లా నుంచి మొట్టమొదటిసారిగా ఇండియన్ అథ్లెటిక్స్‌పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా పూజను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి, అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

కథల పోటీల్లో ఆవునూరు విద్యార్థిని ప్రతిభ



శృతిక

గంభీరావుపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మాచిరాజు బాల సాహిత్య పీఠం నిర్వహించిన కథలపోటీల్లో ముస్తాబాద్ మండలం ఆవునూరు ఉన్నత పాఠశాలలో 9వతరగతి చదువుతున్న ఎలుసాని శృతిక రాసిన కథ ప్రత్యేక బహుమతికి ఎంపికైంది. ఈ కథల పోటీల్లో ఉభయ రాష్ట్రాల నుంచి 541 కథలు రాగా, అందులో 35 మంది రాసిన కథలను ఎంపిక చేశారు. జూన్ మాసంలో హైదరాబాద్ రవీంద్రభారతీలో శృతికకు సన్మానంతో పాటు నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో పాటు బాలసాహిత్యానికి చెందిన పుస్తకాలు అందజేస్తారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మన్ తెలిపారు.

మూడు కాళ్ల కోడి




మూడు కాళ్లతో ఉన్న కోడి

తంగళ్లపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లిలోని ఓ పౌల్ట్రీ ఫాంలో మూడు కాళ్ల కోడిని నిర్వాహకుడు గురువారం గుర్తించాడు. గ్రామంలోని రాజిరెడ్డికి చెందిన పౌల్ట్రీ షెడ్‌ను లక్ష్మణ్ అనే వ్యక్తి లీజుకు తీసుకొని బాయిలర్ కోళ్లను పెంచుతున్నాడు. కోళ్లకు మేత వేస్తున్న క్రమంలో మూడుకాళ్ల కోడి లక్ష్మణ్‌కు కనిపించింది. ఈవిషయం గ్రామస్తులకు తెలియడంతో కోడి ఫొటో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

పిడుగుపాటుతో దున్నపోతు మృతి

గన్నేరువరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుకుల కొండాపూర్‌లో బుధవారం రాత్రి అకాల వర్షంతోపాటు పిడుగుపడగా గ్రామానికి చెందిన రైతున్యాలపట్ల రాజయ్యకు చెందిన దున్నపోతు మృతిచెందింది. సుమారు 30వేల నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని వేడుకున్నాడు.



ఉపాధికి మార్గం పాలిటెక్నిక్ డిప్లొమా

- పదో తరగతి విద్యార్థులకు అవకాశం
- తక్కువ ఖర్చుతో సాంకేతిక విద్య
- పాలిసెట్-25 పిలుస్తోంది

చొప్పదండి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆధునిక కాలంలో ఉత్పత్తి రంగానికి, సాంకేతిక విద్య అభ్యసించే వారికి డిమాండ్ అధికంగా ఉంది. అందులో పదో తరగతి పూర్తి కాగానే వెంటనే ఉత్పత్తి ఆధారిత రంగాల్లో చదువుకోవాలనే విద్యార్థులకు పాలిటెక్నిక్ ఒక అద్భుతమైన మార్గం. పాలిటెక్నిక్ కోర్సు చదివిన విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయి. విద్యార్థులకు 'పాలిసెట్' ప్రవేశ పరీక్ష ద్వారా పాలిటెక్నిక్ కళాశాలల్లో చేరేందుకు తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. పదో తరగతి తర్వాత ఇంజనీరింగ్ టెక్నికల్ కోర్సుల్లో చేరి సత్వర ఉపాధి పొందవచ్చు. అలాంటి విద్యార్థులకు చక్కటి మార్గం పాలిటెక్నిక్ డిప్లొమా. డిప్లొమా కోర్సు పూర్తయ్యాక వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాలు పొందవచ్చు.


● పాలిటెక్నిక్‌లో చేరి చదువుకుంటే విద్యార్థులకు భవిష్యత్తులో ఎంతో మేలు జరుగుతుంది. చిన్న వయసులోనే ప్రత్యేకంగా తమకిష్టమైన రంగంలో నైపుణ్యం సాధించొచ్చు. పాలిటెక్నిక్‌లో విద్యార్థులు తక్కువ ఖర్చుతో సాంకేతిక నైపుణ్యాన్ని అందిపుచ్చుకొని మంచి భవిష్యత్తును రూపొందించుకోవచ్చు. పది పాసైన విద్యార్థులకు పాలిటెక్నిక్ కోర్సు ఒక సువర్ణ అవకాశం.

● కోర్సుల వివరాలు

పాలిటెక్నిక్‌లో మూడు సంవత్సరాల డిప్లొమా కోర్సు ఉంటుంది. పదవ తరగతి నుంచి ప్రశ్నలు ఉంటాయి. డీఈఈఈ, డీఎంఈ, డీసీఎంఈ, సివిల్, కంప్యూటర్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ వంటి 24 కోర్సులు ఉంటాయి. కళాశాలలోని ఒక్కో కోర్సులో 60 సీట్లు అందుబాటులో ఉంటాయి. డిప్లొమా అనంతరం క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించి పలు కంపెనీలు ఉద్యోగాల్లో చేర్చుకుంటున్నాయి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఉద్యోగాలు కుడా ఈ డిప్లమా కోర్సు ద్వారా సాధించవచ్చు. ఈ-సెట్ ప్రవేశ పరీక్ష రాసి బీటెక్‌లో నేరుగా ద్వితీయ సంవత్సరంలోకి చేరే అవకాశం ఉంటుంది. అందరి లాగానే బీటెక్ చేసి గ్రాడ్యుయేట్ కావచ్చు. కొన్నికళాశాలల్లో హాస్టల్ సదుపాయాలు కూడా ఉన్నాయి.

● వ్యవసాయ అనుబంధ కోర్సులు

ఇంజనీరింగ్. అగ్రి. వెటర్నరీ హార్టికల్చర్ డిప్లమా కోర్సులలో ప్రవేశం పొందవచ్చు. వ్యవసాయ విద్య విశ్వ విద్యాలయం పరిధిలో రెండేళ్ల అగ్రికల్చర్ డిప్లమా, ఆర్గానిక్ అగ్రికల్చర్ డిప్లమా, మూడేళ్ల వ్యవధిలో పూర్తయ్యే డిప్లమా ఇన్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కోర్సులో పాలిసెట్ ద్వారా ప్రవేశం పొందవచ్చు. వెటర్నరీ విశ్వ విద్యాలయం పరిధిలో రెండేళ్ల యానిమల్ హస్బెండ్రీ పాలిటెక్నిక్ కోర్సు, ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలో రెండేళ్ల డిప్లమా ఇన్ హార్టికల్చర్ కోర్సుల్లో సీట్ల భర్తీకి పాలిసెట్-25 నోటిఫికేషన్ విడుదల అయ్యింది.



పాలిసెట్ వివరాలు

- ఏప్రిల్ 19 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.
- 100 రూపాయల ఆలస్య రుసుముతో ఏప్రిల్ 23 వరకు, దరఖాస్తు చేసుకోవచ్చు.
- మే13న ప్రవేశ పరీక్ష
- పరీక్ష సమయం 2-30 గంటలు
- 150 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.

గణితం నుంచి 60 మార్కులు, భౌతిక శాస్త్రం-30, రసాయన శాస్త్రం-30, జీవశాస్త్రం-30 మార్కుల చొప్పున పదవ తరగతి సిలబస్ ప్రశ్నలు ఉంటాయి.

● పూర్తి వివరాలకు https://polycet.sbtet.telangana.gov.in సైట్‌లో చూసుకోవచ్చు.

ఫీజు వివరాలు: ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 250 రూపాయలు.

బీసీ, జనరల్ విద్యార్థులకు 500 రూపాయలు.

అర్హతలు : పదో తరగతి పాస్ అవ్వాలి. 2025లో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు కూడా పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. 2025 డిసెంబర్ 31 నాటికి విద్యార్థుల వయస్సు 15 నుంచి 22 ఏళ్ల మధ్యలో ఉండాలి.

ఎదురెదురుగా ఢీకొన్న ఆటో, ఆర్టీసీ బస్సు

● ఆటోలో మందుగుండు సామగ్రిని గుర్తించిన పోలీసులు

గంగాధర, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం మధురానగర్‌వద్ద జాతీయ ప్రధానరహదారిపై ఆటో, బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. స్థానికులు, ఎస్సై తెలిపిన వివరాలప్రకారం టీజీ 02 టిటి1770 నంబరుగల ఆర్టీసీ బస్సు కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు వెళ్తోంది. జగిత్యాల నుంచి కరీంనగర్‌వైపు రెండు నెంబర్లు గల ఆటో(ఏపి36 టిబి5246,ఏపి36డబ్ల్యు6231) గంగాధర మండలం మధురానగర్ జాతీయ ప్రధానరహదారిపై ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే ఆటోలోని బాక్సులను తీసి బయటపడేసి డ్రైవర్ పరారయ్యాడు. విషయాన్ని బస్సుడ్రైవర్ పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ప్రమాదస్థలంలోని బాక్సులను పరిశీలించారు. బాక్సుల్లో పేలుడు పదార్థాలు(400జిలిటెన్ స్టిక్స్), వాటికి ఉపయోగించే వైరు బెండల్ లభించింది. ఈ ప్రమాదంలో ఎలాంటి నష్టం



ఆటోలో లభించిన జిలిటెన్ స్టిక్స్

జరగకపోవడంతో బస్సులోని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. బస్సుడ్రైవర్ మెరుగుశ్రీనివాస్ పిర్యాదు మేరకు కేసు నమోదుచేసి అక్రమంగా, అనుమతిలేకుండా పేలుడు పదార్థాలను తరలిస్తు గుర్తుతెలియని ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

హుజూరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని ఓ లాడ్జీలో పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు టౌన్‌సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు. ఎనిమిదిని పట్టుకొని, వారివద్ద నుంచి రూ.16,710 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు టౌన్‌సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

జగిత్యాలరూరల్: జగిత్యాలరూరల్‌స్టేషన్ పరిధిలోని నర్సింగాపూర్ గ్రామశివారులో పేకాట స్థావరంపై సీసీఎస్ పోలీసులు దాడులు చేసి ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 10,180 నగదుతో పాటు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

హనుమాన్ ఆలయంలో దొంగతనం

మానకొండూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం గ్రామంలోని హనుమాన్ ఆలయంలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. ఆలయం గ్రామశివారులో ఉండడంతో రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయం తాళాలు పగులకొట్టి హుండీలోని నగదు రూ.15వేలు, 10తులాల వెండిని ఎత్తుకెళ్లారు. గురువారం ఎప్పటిలాగే పూజారి ఆలయానికి వెళ్లగా తాళాలు పగులకొట్టి ఉండడాన్ని గమనించి ఆలయకమిటీకి తెలియజేశారు. కమిటీతో పాటు గ్రామస్థులు ఆలయానికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ లక్ష్మీనారాయణ దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గంజాయి పట్టివేత

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ స్టేషన్ పరిధిలోని టీఆర్‌నగర్‌లో తనిఖీలు చేయగా ఎండీ.యాసిర్ అనే వ్యక్తి వద్ద 145 గ్రాముల గంజాయిని సీసీఎస్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. గంజాయిని జగిత్యాల రూరల్ పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ వినోద్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ గర్భిణి మృతి

కరీంనగర్‌క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రక్తస్రావంతో బాధపడుతూ కరీంనగర్ మాతాశిశుకేంద్రంలో చికిత్సపొందుతూ జంగంపల్లి సంధ్య అనే గర్భిణి గురువారం ఉదయం మృతిచెందింది. కరీంనగర్ రెండో ఠాణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా తాండూర్ గ్రామానికి చెందిన సంధ్య బుధవారం అనారోగ్యానికి గురైంది. మంచిర్యాలలోని ఒకప్రైవేట్‌ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని, మెరుగైనచికిత్స కోసం కరీంనగర్‌లోని మాతాశిశు కేంద్రానికి వచ్చింది. ఇక్కడచికిత్సపొందుతూ గురువారం మృతిచెందింది. మృతురాలు సంధ్య భర్త జంగంపల్లి జగదీష్ ఇచ్చిన ఫిర్యాదుతి మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

పాలకుర్తి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కన్నాల గ్రామానికి చెందిన కొల్లూరి రాయమల్లు (73) ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి భార్య అనారోగ్య కారణాలతో గతంలో మృతిచెందడంతో రాయమల్లు ఒంటరిగా ఉంటున్నాడు. పెద్దపల్లిలో నివాసం ఉంటున్న రాయమల్లు కుమారుడు పలుమార్లు అతడివద్దకు రావాలని కోరినా వెళ్లలేదు. భార్య చనిపోయిన విషయాన్ని మనస్సులో పెట్టుకుని మనోవేదనతో బుధవారం సాయంత్రం గడ్డి మందు తాగగా గమనించిన స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై స్వామి తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కశ్మీర్‌గడ్డ ప్రాంతానికి చెందిన మహ్మద్ అజీజ్(31) అనే యువకుడు బుధవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ రెండో ఠాణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అజీజ్ కొంత కాలంగా మద్యానికి బానిసగా మారాడన్నారు. బుధవారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చి తన భార్యను డబ్బులు అడిగితే ఇవ్వకపోవటంతో గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. అనంతరం అనుమానం వచ్చి గదిలో చూసేసరికి ఉరివేసుకుని ఉన్నాడు. తాగిన మైకంలో అజీజ్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఎలక్ట్రీషియన్ మృతి

రామడుగు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం వెదిర శివారులోని కరీంనగర్-జగిత్యాల ప్రధానరహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో కరీంనగర్ మున్సిపల్‌కాంట్రాక్టు ఎలక్ట్రీషియన్ రాజశేఖర్ మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. రామడుగు మండలంలోని వెదిర పరిధిలోని రాజాజీనగర్‌కు చెందిన కుమ్మరి రాజశేఖర్(27) కరీంనగర్ మున్సిపల్ కార్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిలో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం సాయంత్రం పని నిమిత్తం ద్విచక్రవాహనంపై వెళ్తూ అనూహ్యంగా బ్రిడ్జి వద్ద చెట్టుకు ఢీకొట్టాడు. దీంతో ఆయన తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేములవాడ ప్రధాన రహదారి కొలతల సేకరణ



వేములవాడలో ప్రధాన రహదారిలోని భవనాల కొలతలు వేస్తున్న అధికారులు

వేములవాడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని ప్రధాన రహదారి ఇరువైపులా దుకాణాలు, భవనాల కొలతలను అధికారులు సేకరిస్తున్నారు. మెయిన్ రోడ్డు విస్తరణలో ఇండ్లు, దుకాణాలు, వాణిజ్య సముదాయాలు కోల్పోనున్న నిర్వాసితుల తుది జాబితా సిద్ధం చేసే క్రమంలో వివిధ శాఖలకు చెందిన 24 మంది అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి గురువారం కొలతలు సేకరించారు.

రేపు పునఃప్రారంభం కానున్న
కాజీపేట్-దాదర్ ఎక్స్‌ప్రెస్ రైలు

పెద్దపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్ కుంభమేళా సందర్భంగా రద్దయిన కాజీపేట్-దాదర్ వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలును ఈ నెల 12వ తేదీ నుంచి పునరుద్ధరిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. నంబర్ 07197/98గల కాజీపేట- దాదర్ ఎక్స్‌ప్రెస్ రైలు శుక్రవారం నుంచి నడవ నున్నది. ఈ రైలు జూన్ 28వ తేదీవరకు ఎగువ, దిగువ ఇరువైపులా 24 ట్రిప్పులు నడవనున్నది. ప్రతీశనివారం కాజీపేటలో ఉదయం 11:30గంటలకు బయలుదేరి పెద్దపల్లిజంక్షన్‌కు 12:36గంటలకు చేరుకోనున్నది. మరుసటిరోజు మధ్యాహ్నం1:26 గంటలకు దాదర్ చేరుకొంటుంది. తిరుగు ప్రయాణంలో ఆదివారం మధ్యాహ్నం3:25 గంటలకు దాదర్‌రైల్వేస్టేషన్ నుంచి బయలు దేరి మరుసటిరోజు సోమవారం రాత్రి7:38 గంటలకు పెద్దపల్లిజంక్షన్‌కు, రాత్రి9:30 గంటలకు కాజీపేట చేరుకోనున్నది. ఈ రైలు కరీంనగర్ జిల్లా జమ్మికుంట స్టేషన్‌లో కూడా ఆగనున్నది. కాజీపేటనుంచి జమ్మికుంట, పెద్దపల్లి, బల్లార్షా, ఆదిలాబాద్, నాందేడ్ మీదుగా ప్రయాణిస్తుంది. నంబర్07195/96గల కాజీపేట- దాదర్, వయాపెద్దపల్లిజంక్షన్, నిజామాబాద్ మీదుగావెళ్లే రైలును ఇంకా పునరుద్ధరించలేదు. ఈరైలును పునరుద్ధరిస్తే 200 కిలోమీటర్ల దూరం తగ్గడంతోపాటు సమయం, డబ్బులు ఆదా కానున్నాయని ఆ రైలును పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని గురువారం పెద్దపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఏసీపీ కార్యాలయంలో డీసీపీ కరుణాకర్ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని బండారికుంటకు చెందిన షేక్‌ఆసిఫ్ కొన్నేళ్లుగా ఇతరప్రాంతాల నుంచి గంజాయిని కొనుగోలు చేసి ఇక్కడ విక్రయిస్తున్నాడని వెల్లడించారు. ఆటో డ్రైవర్‌గా జీవిస్తున్న ఆసిఫ్ జల్సాలకు అలవాటుపడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ అక్రమ వ్యాపారానికి పాల్పడుతున్నట్లు డీసీపీ పేర్కొ న్నారు. నిందితుడికి గతంలోనూ నేర చరిత్ర ఉందన్నారు. 2016 నుంచి 2024 మధ్య అతనిపై ఎనిమిది గంజాయి కేసులు నమోదయ్యాయని, పిడి యాక్ట్ కింద కూడా శిక్ష అనుభవించాడని డీసీపీ తెలిపారు. పోలీసుల నిఘా పెరగడంతో ఆసిఫ్ మొగ్దుంపూర్‌కు మకాం మార్చాడన్నారు. కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో ఆటో నడుపుతూ గంజాయి విక్రయిస్తున్నాడన్నారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌చెందిన సల్మాన్ అనేవ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి, చిన్న ప్యాకెట్లుగా తయారుచేసి విద్యార్థులు, యువతకు విక్రయిస్తున్నాడని తెలిపారు.

పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద గంజాయి కోసం ఎదురుచూ స్తున్న వారికి వాట్సాప్ ద్వారా సమాచారం ఇచ్చి విక్రయిస్తుండగా పోలీసులు అతన్ని పట్టుకున్నట్లు డీసీపీ కరుణాకర్ వివరించారు. రూ.50వేల గంజాయితోపాటు, సెల్‌ఫోన్, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితుడిని పట్టుకొన్న సీఐ కె.ప్రవీణ్ కుమార్,ఎస్సై జె. లక్ష్మణ్ రావు,సిబ్బందిని డీసీపీ అభినందించారు.

అకాల వర్షంతో.. అన్నదాతకు నష్టం..

●నేలకొరిగిన మొక్కజొన్న, నేలరాలిన మామిడి ● కళ్లాల్లో తడిసిన ధాన్యం

గన్నేరువరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం అర్ధరాత్రి కురిసిన అకాలవర్షం మాదాపూర్ గ్రామంలో బీభత్సం సృష్టించింది. అకాలవర్షంతోపాటు ఈదురుగాలులతో చేతికి వచ్చిన మొక్కజొన్న పంట నేలకొరిగింది. మామిడితోటల్లో మామిడి కొమ్మలు విరిగిపడడంతో పెద్దమొత్తంలో మామిడి నేలరాలి రైతులకు అపార నష్టం వాటిల్లింది. మాదాపూర్ గ్రామానికిచెందిన రైతులు మాదుగుల మహేష్, గొడుగు స్వామికి చెందిన మొత్తం నాలుగు ఎకరాల మొక్కజొన్న పంట నేలకొరిగింది. ఇదేగ్రామంలో మామిడితోటల్లో భారీ నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే పంటనష్టాన్ని ప్రకటించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

అనంతగిరిలో వడగళ్ల వాన..

ఇల్లంతకుంట: మండలంలోని పలుగ్రామాల్లో పడిన వడగళ్లవానతో భారీగా పంటలకు నష్టంవాటిల్లింది. అనంతగిరి, పెద్దలింగాపూర్, తిప్పాపూర్ గ్రామాల సమీపంలోని పంట పొలాలపై బుధవారం అర్ధరాత్రి గంటపాటు రాళ్ల వాన పడింది. దీంతో కోతకు వచ్చిన దాదాపు 250 ఎకరాల విస్తీర్ణంలోని వరిచేన్లు భారీగా దెబ్బతిన్నాయి. తమకు వడగళ్ళు తీరని నష్టం కలిగించాయని రైతులు తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు. దీనిపై వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ మూడు గ్రామాల్లో జరిగిన నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేసి ఉన్నతాధికారులకు పంపినట్లు పేర్కొన్నారు.



కోనరావుపేట మండలం మంగళపల్లిలో నేలకొరిగిన మొక్కజొన్న



గంభీరావుపేట మండలం గజసింగవరంలో వర్షానికి తగిసిన ధాన్యం



వేములవాడ నాగాయపల్లిలో విరిగిపడిన చెట్లను తొలగిస్తున్న పోలీసులు



అనంతగిరి గ్రామంలో పడిన వడగళ్లు



గన్నేరువరం: నేలవాలిన మొక్కజొన్నను చూపిస్తున్న రైతు మాదుగుల మహేష్

వేములవాడ రూరల్: బుధవారం అర్ధరాత్రి కురిసిన గాలివాన మండలంలో బీభత్సం సృష్టించింది. ఉరుములు మెరుపులతో కురిసిన గాలివానతో తీవ్రపంటనష్టం వాటిల్లింది. బొల్లారం గ్రామంలో వరిపంట నేలకొరిగి ధాన్యం రాలిపోయింది. దీంతో రైతులు కన్నీరుమున్నీరయ్యారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. నాగాయపల్లి గ్రామంలో గాలివానకు రోడ్డుపై విరిగిపడ్డ చెట్లను బ్లూకోల్ట్ పోలీసులు తొలగించారు. ప్రధానరహదారిపైచెట్లు విరిగి పడిపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగకుండా పోలీసు సిబ్బంది శ్రీనివాస్, మల్లేశం స్థానికులతో కలిసి తొలగించారు.

తడిసిన ధాన్యం..

కోనరావుపేట/గంభీరావుపేట: కోనరావుపేట, గంభీరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రాత్రి అకాల వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం తడిసిపోయింది. మంగళపల్లెలో మొక్కజొన్న నేలకొరిగింది. ఒక్కసారి రాత్రి రావడం వల్ల రైతులు ధాన్యాన్ని కాపాడుకోవడానికి ఇబ్బందులు పడ్డారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి..

ఇల్లందకుంట: ఈదురుగాలులతో నేలకొరిగిన మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతుసంఘం కరీంనగర్ జిల్లాకమిటీ సభ్యుడు చెల్పూరి రాము అన్నారు. గురువారం మండలంలోని శ్రీరాములపల్లిలో ఈదురు గాలులతో నేలకొరిగిన మొక్కజొన్న పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాము మట్లాడుతూ మండలంలో సుమారు 150ఎకరాల వరకు మొక్కజొన్న పంట నేలకొరిగిందన్నారు. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి ఎకరానికి రూ.50వేలు ఇప్పించాలన్నారు. లేకపోతే రైతులందరితో కలిసి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

గల్ఫ్ అడ్వైజరీ కమిటీ గౌరవ సభ్యుడిగా ఆది శ్రీనివాస్



ఆది శ్రీనివాస్

వేములవాడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ కార్మికుల కోసం సంక్షేమం కోసం రూపొందించనున్న ఎన్నారై పాలసీ అడ్వైజరీ కమిటీ గౌరవ సభ్యుడిగా వేములవాడ శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నియమితులయ్యారు. అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి బీఎం వినోద్‌కుమార్, వైస్‌చైర్మన్‌గా మంద భీమ్‌రెడ్డి, గౌరవ సభ్యులుగా వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ఆర్ భూపతిరెడ్డి, తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్‌కుమార్‌ను నియమించారు. సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, లిజీ జోసెఫ్, చెన్నమనేని శ్రీనివాసరావు, కొట్టాల సత్యనారాయణగౌడ్(దుబాయ్), గుగ్గిళ్ళ రవీందర్, నంగి దేవేందర్, పరికిపండ్ల స్వదేశ్‌ను ఈకమిటీలో సభ్యులుగా నియమిస్తూ రాష్ట్రప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ఎన్ఆర్ఐ పాలసీ రూపకల్పన నిమిత్తం ఏర్పాటు చేసిన ఈ కమిటీలో జిల్లా నుంచి ప్రభుత్వ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు అవకాశం లభించడం విశేషం.

బాలికపై అత్యాచారయత్నం

ఎలిగేడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం రాములపల్లి గ్రామంలో ఒకటవ తరగతి చదువుతున్న బాలికపై యువకుడు (25) అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం సాయంత్రం పాఠశాల నుంచి బాలిక ఇంటికి వచ్చింది. తల్లిదండ్రులకు గ్రామంలో పని ఉండడంతో ఇంటి సమీపంలో ఉన్న దగ్గరి బంధువు వద్ద బాలికను ఉండమని చెప్పి వెళ్ళారు. దీనిని అదునుగా తీసుకొన్న యువకుడు బాలికపై వికృత చేష్టలకు పాల్పడినట్లు తెలిసింది. ఇంటికి తిరిగివచ్చిన తల్లిదండ్రులకు బాలిక అక్కడ జరిగిన విషయాన్ని ఏడ్చుకుంటూ చెప్పింది. దీంతో తల్లిదండ్రులు జూలపల్లి పోలీసులకు సమాచారం అందించారు.

వస్తున్నాం..అంజన్నా..





విద్యుద్దీపాలతో కాంతులీనుతున్న అంజన్న ఆలయం

అంజన్న జయంతికి ఏర్పాట్లు ..

- కొండపైన, ఘాట్‌రోడ్డుపైన, 28 చోట్ల చలివేంద్రాలతో పాటు మొబైల్ వాహనాల ద్వారా భక్తులకు నీటిని అందించనున్నారు.
- ఘాట్‌రోడ్డుపై వాహనాలకు అనుమతి లేకపోగా కొండపైన బొజ్జ పోతన్న, కొండగట్టు స్టేజీల వద్ద పోలీసుల ఔట్ పోస్టు ఏర్పాటు
- దీక్ష విరమణలకు ప్రస్తుతం ఉన్న అర్చకులకు తోడు మరో వంద మంది సిబ్బంది నియామకం
- కొండగట్టు స్టేజీ సమీపంలోని తుమ్మ చెరువు, కొండపైన బొజ్జ పోతన్న ఆలయం, దొంగలమర్రి-జేఎన్‌టీయూ మార్గంలో బృందావనం రిసార్ట్, జేఎన్‌టీయూ సమీపంలో కొండ పైకి వెళ్లే మార్గంలో, దాని పక్కనే వాహనాల కోసం పార్కింగ్‌కు ఏర్పాట్లు
- పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో 366 మంది సిబ్బందితో మూడు షిఫ్ట్‌లలో పారిశుధ్య నిర్వహణ
- నాలుగు లక్షల లడ్డూలు తయారీ
- బస్టాండ్ వద్ద ఏడు ప్రసాద, ఏడు టికెట్ కౌంటర్ల ఏర్పాటు
- ఆరు కేంద్రాల్లో మూడు షిఫ్ట్‌లలో కొండపైన, స్టేజీ వద్ద వైద్య సిబ్బంది విధులు
- మెట్ల మార్గంలో విద్యుత్ దీపాల ఏర్పాటుతో పాటు 24గంటల విద్యుత్ సౌకర్యం, జనరేటర్‌ల ఏర్పాటు
- అందుబాటులో ఫైర్ ఇంజన్, అంబులెన్స్ సౌకర్యం
- భక్తులకు సరిపడా జగిత్యాల, వేములవాడ, కరీంనగర్ నుంచి ఆర్టీసీ బస్సుల సేవలు
- నాలుగు బ్లాక్‌లలో తాత్కాలిక మరుగుదొడ్లు, మొబైల్ మరుగుదొడ్లు

- నేటి నుంచి హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు
- కొండగట్టులో మూడు రోజుల పాటు వేడుకలు
- తరలిరానున్న లక్షలాది భక్తులు

మల్యాల ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో శుక్రవారం నుంచి హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. శుక్రవారం నుంచి ఆదివారం వరకు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా అంజన్న దీక్షాపరులు, భక్తులు కాలినడకన, వాహనాల ద్వారా అంజన్న సన్నిధికి చేరుకోనున్నారు. దీక్షాపరులు ఇక్కడ మాల విరమణ చేయడం అత్యంత పవిత్రంగా భావిస్తారు. కొండగట్టులో జరిగే ఉత్సవాల కోసం అంజన్న ఆలయ పరిసరాల్లో క్యూలైన్, బారి కేడ్లు తదితర ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే నిత్యం వేలాదిగా తరలివస్తూ స్వామి వారిని దర్శించుకుంటున్నారు. ఈ ఉత్సవాలకు సుమారు 650మందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వీరంతా షిఫ్ట్ పద్ధతిలో దిగువ కొండగట్టు, ఘాట్ రోడ్డు, కొండపైన, ఆలయం, దీక్షవిరమణ మండపం, ప్రసాదాల కౌంటర్, కోనేరు, పార్కింగ్ స్థలాలు, జేఎన్‌టీయూ, దొంగల మర్రి ప్రాంతాల్లో విధులు నిర్వహించనున్నారు.

నేటి ఆర్జిత సేవలు రద్దు

శుక్రవారం నుంచి సోమవారం వరకు వరకు కొండగట్టు అంజన్న సన్నిధిలో ఆర్జిత సేవలు నిలిపి వేస్తున్నట్లు ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. ఏప్రిల్ 11నుంచి 13 వరకు జయంతి ఉత్సవాలు జరగనుండగా ఆర్జిత సేవలు వాహనపూజలు, అభిషేకాలు, సత్యనారాయణ వ్రతాలు తదితర పూజలు ఉండవని భక్తులు సహకరించాలని కోరారు. మళ్లీ ఏప్రిల్ 14 నుంచి ఆర్జిత సేవలు యథావిధిగా కొన సాగుతాయని అన్నారు.

ప్రత్యేక అధికారిగా శ్రీనివాసరావు

కొండగట్టు హనుమాన్ చిన్న జయంతి వేడుకల సందర్భంగా ఉత్సవాలు సజావుగా నిర్వహణకు గాను దేవాదాయ శాఖ ఉత్సవాల ప్రత్యేక అధికారిని నియమించింది. అడిషనల్ కమిషనర్ ఇ.శ్రీనివాస్‌రావును ప్రత్యేక అధికారిగా నియమించడంతో కొండపైన దేవస్థానం అధికారులతో ఆయన కలిసి ఏర్పాట్లు, సౌకర్యాలు పర్యవేక్షిస్తున్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం: శ్రీకాంత్‌రావు, ఈవో

జయంతి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. తాగునీటి కోసం చలివేంద్రాలు, మొబైల్ చలివేంద్రాలు, పార్కింగ్, క్యూలైన్ తదితర ఏర్పాటు చేశాం. పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ లక్షలాదిగా వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ఉత్సవమూర్తుల యాగశాల ప్రవేశం

మల్యాల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): చిన్నహనుమాన్ జయంతి నేపథ్యంలో వేలాదిగా తరలివచ్చి మాల విరమణ చేసే దీక్షపరుల కోసం కల్యాణకట్ట వద్ద ఏర్పాటు చేసిన మాల విరమణ మండపానికి స్వామి వారి ఉత్సవమూర్తుల తీసుకెళ్లారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఈవో శ్రీకాంత్‌రావు, స్థానాచార్యులు కపీందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేందర్, రఘు, అర్చకులు, వేదపండితులు ఉత్సవ మూర్తుల దీక్షావిరమణ మండప ప్రవేశంలో పాల్గొన్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు: కలెక్టర్ సత్యప్రసాద్

మల్యాల, ఆంధ్రజ్యోతి: చిన్నజయంతి సందర్భంగా కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ సత్య ప్రసాద్ తెలిపారు. గురువారం రాత్రి కొండగట్టులో ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు. కార్యక్రమంలో ఈవో శ్రీకాంత్, డీఎస్పీ రఘు చందర్, సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్‌కుమార్ ఉన్నారు.





పాదయాత్రగా వస్తున్న దీక్షాపరులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్



ఉత్సవమూర్తుల దీక్ష విరమణ మండప ప్రవేశానికి తీసుకువస్తున్న అర్చకులు

మంత్రుల పర్యటనకు భారీ భద్రత చర్యలు

- 300 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది
- సిరిసిల్ల ఎస్పీ మహేష్ బి గీతే



మాట్లాడుతున్న ఎస్పీ మహేష్ బీ గీతే

సిరిసిల్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల శివారులో అపెరల్ పార్కులో టెక్స్‌పోర్టుయూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముగ్గురుమంత్రులు వస్తున్న సందర్భంగా పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశామని ఎస్పీ మహేష్ బీ గీతే తెలిపారు. గురువారం జిల్లాపోలీస్ కార్యాలయంలో అధికారులతో భద్రతా ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం అపెరల్ పార్కులో టెక్స్‌పోర్టు యూనిట్ ప్రారంభోత్సవానికి మంత్రులు వస్తున్నా సందర్భంగా దాదాపు 300మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్టభద్రత ఏర్పాట్లు చేశామని తెలిపారు. యూనిట్ ప్రారంభోత్సవ ప్రాంగణంలో వీఐపీ గ్యాలరీ, సభ ప్రాంగణంలో వీవీఐపీ జనరల్ పార్కింగ్ ప్రదేశాల్లో బందోబస్తులో ఉన్న అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ మురళీకృష్ణ, సీఐలు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సదన్‌కుమార్, మధుకర్, నాగేశ్వర్‌రావు, ఆర్ఐలు రమేష్, యాదగిరి, ఎస్ఐలు పాల్గొన్నారు.

84.1శాతం మొబైల్ ఫోన్లు రికవరీ

సిరిసిల్ల క్రైం: జిల్లాలో 84.1శాతం మొబైల్ ఫోన్‌ల రికవరీ చేశామని ఎస్పీ మహేశ్ బి గితే తెలిపారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో సెల్ ఫోన్ రికవరీ మేళా ఏర్పాటుచేసిన సందర్భంగా రూ.10లక్షల విలువైన 100ఫోన్‌లను ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 1587 ఫోన్‌లను బాధితులకు అందజేశామన్నారు. ఫోన్‌ల రికవరీలో, బాధితులకు అప్పగించడంలో కృషిచేస్తున్న ఐటి కోర్ ఎస్ఐ కిరణ్‌కుమార్, కానిస్టేబుల్ రాజా తిరుమలేష్‌ను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచి డీఎస్పీ మురళికృష్ణ, ఐటి కోర్ ఎస్ఐ కిరన్‌కుమార్, ఆర్ఐలు రమేశ్, యాదగిరి, ఎస్ఐ శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీష్ జైలుకు వెళ్లడం ఖాయం

- ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ గజ్జెల కాంతం



మాట్లాడుతున్న గజ్జెల కాంతం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీష్‌రావు అధికారాన్ని అడ్డుపెట్టుకొని సంపాదించిన అక్రమాస్తులపై విరారణ జరగుతుందని, వారంతా జైలుకు వెళ్లడం ఖాయమని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్, తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గజ్జెల కాంతం అన్నారు. గురువారం నగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజాంకు సంబంధించిన వేలాది ఎకరాల భూమిని తమ బినామీల పేరుమీదకు మార్చడానికే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి తీసుకువచ్చిందని ఆరోపించారు. ప్రాజెక్టులు, విద్యుత్ పేరుతో ఏడు లక్షల కోట్ల అప్పు చేశారని, అందులో వారు మూడు లక్షల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. పదేళ్ల కాలంలో పదివేల ఎకరాల భూమిని వారి బినామిల పేర్లమీదకు వెళ్లాయని ఆరోపించారు. సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అందులో భాగంగానే ఎస్సీ వర్గీకరణ చేసిందిని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం కృషి చేస్తోందన్నారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు బీసీలపై ప్రేమ ఉంటే 42 శాతం రిజర్వేషన్ అమలుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. పది సంవత్సరాలు బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉందని, అసెంబ్లీలో పూలే విగ్రహం పెట్టాలన్న విషయం కవితకు అప్పుడు ఎందుకు గుర్తుకురాలేదని ప్రశ్నించారు. సమావేశంలో సమావేశంలో గజ్జెల ఆనందరావు, సముద్రాల అజయ్, సుద్దాల లక్ష్మన్, అనిల్, ప్రభాకర్, శంకర్, కొండ్ర స్వరూప, ఆవారు లత, గొర్రె రాజయ్య, మైసని మనోహర్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ధర్మారం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గణేష్‌నగర్‌లో పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ శీలం లక్ష్మణ్ ఆదేశాలతో ఏఎస్ఐ అబ్దుల్ జలీల్ ఆధ్వర్యంలో పోలీసులు పేకాట స్థావరం పై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పట్టుకోగా మరో వ్యక్తి పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. వారి నుంచి 24,900 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు.

అంతర్ జిల్లా దొంగ పట్టివేత

- రూ.25 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం
- అరెస్టు చూపించి వివరాలు వెల్లడించిన ఎస్పీ అశోక్ కుమార్



దొంగను అరెస్టు చూపిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కొన్నినెలలుగా తాళం వేసిన ఇళ్లను టార్గెట్‌చేసి బంగారుఆభరణాలు దోచుకుంటున్న అంతర్‌జిల్లా దొంగను జగిత్యాలపోలీసులు పట్టుకున్నారు. రూ.25 లక్షల విలువగల 28.6తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం ఎస్పీ అశోక్‌కుమార్ విలేకరుల సమావేశం నిర్వహించి దొంగను అరెస్టు చూపించి పూర్తివివరాలు వెల్లడించారు. మల్యాల మండలం రాజారం గ్రామానికి చెందిన బక్కశెట్టికొమురయ్య అలియాస్ రేగులఅజయ్‌కుమార్(53) ఉపాధి కోసం మంచిర్యాల జిల్లాకేంద్రంలోని తిలక్ నగర్‌లో ఉంటూ దొంగతనాలు చేయడం ప్రవృత్తిగా మార్చుకున్నాడు. 10సంవత్సరాల క్రితం హైదరాబాద్‌లో లారీ ట్రాన్స్‌పోర్ట్‌లో పనిచేసే సమయంలో దొంగతనం చేసిన కొమురయ్య చంచల్‌గూడలో జైలు జీవితం అనుభవించాడు. బయటకు వచ్చిన అనంతరం 25దొంగతనాలు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ చౌరస్తాలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో కొమురయ్య అనుమానాస్పదంగా సంచరిస్తూ పట్టుబడ్డాడు. విచారణలో అంతర్ జిల్లా దొంగగా పోలీసులు గుర్తించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో మూడు నెలల వ్యవధిలో ఏడు చోట్ల కొమురయ్య దొంగతనాలు చేసి 28.6 తులాల విలువైన బంగారు ఆభరణాలు దోచుకెళ్లినట్లు ఎస్పీ తెలిపారు. అంతర్ జిల్లా దొంగను పట్టుకోవడంతో పాటు బంగారు ఆభరణాలు రికవరీ చేసిన టౌన్ ఇన్‌స్పెక్టర్ వేణు గోపాల్, ఎస్సైలు కిరణ్ కుమార్, గీతను ఎస్పీ అభినందించి రివార్డులను అందజేశారు. ఈ సమావేశంలో డీఎస్పీ రఘ చందర్ తదితరులు ఉన్నారు.



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

బైకును వెనుక నుంచి ఢీకొట్టిన కారు

- చికిత్స పొందుతూ ఒకరు మృతి

శంకరపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడికల్‌శివారులో ఫ్లైఓవర్ దగ్గర ద్విచక్రవాహనాన్ని కారు వెనుకనుంచి ఢీకొట్టిన ఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురిలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా, ఒకరు చికిత్సపొందుతూ మృతి చెందారు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సైదాపూర్‌మండలం గర్రెపల్లికి చెందిన కొడగాని కిషన్‌రావు, తనభార్య శోభ(50), కూతురు అశ్వినితోకలిసి ద్విచక్రవాహనంపై ఎల్లంపల్లి నుంచి మానకొండూర్ మండలం నిజాయితీగూడెం వెళ్తున్నారు. ఈ క్రమంలో ద్విచక్రవాహనం తాడికల్ శివారులోని ఫ్లైఓవర్ వద్దకు చేరుకోగానే కారు(ఏపీ09సీడబ్ల్యూ 0882) వేగంగా, అజాగ్రత్తగా వచ్చి ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కిషన్‌రావు, అతని భార్య శోభ తలకు, తొంటి ఎముకకు, కూతురు అశ్వినికి రెండు కాళ్లకు, కంటి వద్ద తీవ్రంగా గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వీరిని108లో కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శోభను మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. కిషన్‌రావు బావమరిది బూరాల సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

కేజ్ కల్చర్ యూనిట్ల పరిశీలన

సిరిసిల్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మిడ్‌మానేరు ప్రాజెక్ట్‌లో చీర్లవంచ వద్ద ఫిషిన్ ఫార్మా ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేజ్ కల్చర్ యూనిట్‌ను గురువారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పరిశీలించారు. రిజర్వాయర్‌లో ఏర్పాటు చేసిన కేజ్ కల్చర్ యూనిట్‌లలో 4.2 లక్షల విత్తనాలను నిల్వ చేశారు. ప్రస్తుతం మిడ్ మానేరులో నీటి మట్టం తగ్గిపోతుండడంతో ఎక్కువగా పంజరాలను ఏర్పాటు చేయలేకపోతున్నామన్నారు. నీటి మట్టం 8 టీఎంసీలు మాత్రమే ఉన్నందున వేసవి కాలం పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా హెచ్చు తగ్గులు సంభవించే అవకాశం ఉందని ఫిషిన్ ఫాం ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకవచ్చారు. మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లో నీరు ఎక్కువ కాలం అధిక లోతు ఉండి ఇతర జలచరాల భద్రతకు భంగం కలగకుండా ఉండే అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. వారి వెంట జిల్లా ఫీషరీస్ అధికారి సౌజన్యలు ఉన్నారు.



సూచనలు చేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

బీఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్ కార్యకర్తలపై దౌర్జన్యం

- అభివృద్ధి నెపంతో మరోమారు కాంగ్రెస్ ముసుగులో జగిత్యాల ఎమ్మెల్యే అరాచకం
- మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి



జగిత్యాలలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కాంగ్రెస్ కార్యకర్తలపై దౌర్జన్యం చేశారని, ప్రస్తుతం అభివృద్ధి నెపంతో కాంగ్రెస్ ముసుగులో మరోమారు అరాచకం చేయడానికి యత్నిస్తున్నాడని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి ఆరోపించారు. గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మా తాతల..తండ్రుల కాలం నుంచి కాంగ్రెస్ పార్టీ మాదేనని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అంటుండడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ఆ పార్టీ దౌర్జన్యం తట్టుకోలేక హబ్సీపూర్ గ్రామానికి చెందిన యువకుడు సారంగపూర్ అడవుల్లో ఉరివేసుకొని మృతి చెందిన విషయం నిజం కాదా అని ప్రశ్నించారు. జగిత్యాలకు చెందిన బ్లాక్ కాంగ్రెస్ నాయకుడిపై రౌడీషీట్ ఓపెన్ చేయించారని, బీఆర్ఎస్‌లో చేరనందుకు తుంగూరు సర్పంచ్‌ను పదవి నుంచి సస్పెండ్ చేయించారని ఆరోపించారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు రావడానికి కీలక పాత్ర పోషించిన కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తామని తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారన్నారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తానని జీవన్‌రెడ్డి తెలిపారు. గతంలో జగిత్యాలలో ఇళ్లు లేని నిరుపేదలకు 4వేల వ్యక్తిగత ఇళ్లు మంజూరు చేయించి నిర్మాణం చేపట్టామని గుర్తు చేశారు. కొడిమ్యాల మండలం నాచుపల్లి వద్ద జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల, పొలాసలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం, నూకపల్లి వద్ద న్యాక్ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు కృషి చేశానని జీవన్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పెద్దల సహకారంతో రాయికల్, పొలాస, బీర్పూర్ సీపీడబ్ల్యూ స్కీమ్ కోసం రూ.15 కోట్లు మంజూరు చేయించానన్నారు.

ఈ సమావేశంలో టీపీసీసీ సెక్రెటరీ బండ శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గాజుల రాజేందర్, గుంటి జగదీశ్వర్, రాధాకిషన్ రావు, పుప్పాల అశోక్, జితేందర్, మహిపాల్, మధు తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డిపో మేనేజర్

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జగిత్యాల డిపో మేనేజర్ కల్పన తెలిపారు. బస్సుల వివరాలు, ఇతర వివరాల కోసం శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12గంటల వరకు 9959225925 నెంబర్‌కు ఫోన్ చేసి అడగాలని ఆమె కోరారు.

చింతకుంటలో 'గావ్ చలో..బస్తీ చలో'

కథలాపూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతకుంటలో గురువారం గావ్ చలో..బస్తీ చలో కార్యక్రమం బీజేపీ శ్రేణులు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందిన వారితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మోదీ ప్రవేశపెట్టిన పేదలకు ప్రయోజనం కలిగించే పథకాల గురించి చర్చించారు. రాష్ట్రంలో బీజేపీకి మంచి ఫలితాలు వస్తున్నందు వల్ల రాబోవు సానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు గెలిపించుకునేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు మల్యాల మారుతి, బూత్ అధ్యక్షుడు రాజేశ్, కమలాకర్, మహేశ్, విష్ణు, శ్రీహరి, శివ తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కథలాపూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజారాం తండా, పెగ్గెర్ల, ఊట్‌పల్లి గ్రామాల్లో గురువారం రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నాగం భూమయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ వర్ధినేని నాగేశ్వర్‌రావు, ఏఎంసీ డైరెక్టర్లు కారపు గంగాధర్, వాకిటి రాజరెడ్డి, రమేశ్, సింగిల్ విండో డైరెక్టర్లు, సింగిల్ విండో సీఈఓ అరుణ్, రవి, రైతులు ఉన్నారు.

నియామకం

కొడి మ్యాల, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెప్యాల గ్రామ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షునిగా గురువారం చిర్ర ప్రసాద్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా గంగాధర మహేష్, ప్రధానకార్యదరుల్శుగా చిర్ర శ్రీనివాస్, గంగాధర నరేష్, కోశాధికారిగా ముదుగంపెల్లి నరేష్, జాయింట్ సెక్రటరీలుగా గంగాధర నరేష్, లంక అజయ్‌ను సభ్యులు ఎన్నుకున్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి విప్ హామీ

పెగడపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండలలంలోని శాలపల్లి-అడుపపల్లి గ్రామాల మధ్యన భారీ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. శాలపల్లి అడుపపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు గురువారం ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్‌ను ధర్మపురిలోని క్యాంపు కార్యాలయంలో కలసి గత సంవత్సరం భారీ వర్షాలకు కోతకు గురైన బ్రిడ్జి పునర్నిర్మాణంతో పాటు అభివృద్ధి పనులకు నిధులు వెచ్చించాలని వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శోభాతిరుపతి, సింగిల్‌విండో డైరెక్టర్ తిరుపతి, బొడ్డు రమేష్, సురేష్, లింగయ్య, జలపతి ఉన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించే రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, జిల్లా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. గురువారం మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులోని కేఎస్ఆర్ గార్డెన్‌లో నియోజక వర్గంలోని ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా రజతోత్సవ సభకు మెట్‌పల్లి మండల నాయకులతో పాటు ఇతర మండలాలు, ఆటో డ్రైవర్లు నగదును జిల్లా అధ్యక్షుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ఏడాది పాలనలో రాష్ట్రం వెనకబడిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి, మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

●జగిత్యాలరూరల్: బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలని జగిత్యాల మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్ కోరారు. గురువారం జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్ గ్రామంలో దావ వసంత విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ జడ్పీచైర్‌పర్సన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం బీఆర్ఎస్ కృషితోనే సాధ్యపడిందన్నారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆమె విమర్శించారు.

ఈకార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, బీఆర్ఎస్‌రూరల్ మండల అధ్యక్షుడు ఆనందరావు, నాయకులు గంగారెడ్డి, రాజన్న, కమలాకర్‌రావు, తిరుపతి, శ్రీనివాస్, చందు, పోచల్లయ్యగౌడ్, మహేష్, సురేష్, శ్రీనివాస్, తరాల వెంకటేష్, గంగాధర్, గోపాల్, రాకేష్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

●రాయికల్: మండలంలోని తాట్లవాయి గ్రామ బీఆర్ఎస్ సమన్వయ కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు బర్కం మల్లేశ్, మండల, పట్టణ కో ఆర్డినేటర్ తురగ శ్రీధర్ రెడ్డిలు పాల్గొని ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు వినోద్, నాయకులు రాంచందర్ రావు, గంగాధర్ యాదవ్, మహేష్, అంజిత్, తిరుపతి, లక్ష్మణ్ రావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు'

ధర్మపురి, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి అనుబంధ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శనివారం జరిగే ఉత్సవాలకు తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. ఏర్పాట్లపై ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు, అర్చకులు, సిబ్బందితో కలిసి చర్చించి నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆలయం పక్షాన భక్తుల సౌకర్యార్థం దేవాలయం లోపల, వెలువల, చలువ పందిర్లు, క్యూలైన్లు, మంచినీటి వసతి, ఇతరత్రా అన్ని అవసర సౌకర్యాలు కల్పించడం కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వివరించారు. అలాగే అదనంగా లడ్డు ప్రసాదాలు తయారు చేయించి కౌంటర్‌లలో భక్తులకు అందుబాటులో ఉంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ధర్మపురి శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో శనివారం ఉదయం 5 గంటలకు స్వామి వారలకు మన్యసూక్త అభిషేకం, షోడశోపచార పూజలు, నివేదన, నీరాజన మంత్ర పుష్పములు, తీర్థ ప్రసాద వితరణ ఉంటాయని ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు ఉత్సవాల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

'వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి'


చిన్నారులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : గర్భిణీలు కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని అంగన్‌వాడి టీచర్లు అవగాహన కల్పించారు. గురవారం మండలంలోని తిమ్మయ్యపల్లి గ్రామంలోని అంగన్ వాడి కేంద్రంలో పోషణ పక్షోత్సవ కార్యక్రమంలో భాగంగా హ్యాండ్ వాష్ కార్యక్రమాన్ని నిర్వహించి వ్యక్తి పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు బాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

●మెట్‌పల్లి రూరల్: సంపూర్ణ ఆరోగ్యంగానికి పోషకాహారం ఎంతో అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షమీమ్‌సుల్తానా అన్నారు. గురువారం మండలంలోని చౌలమద్ది గ్రామంలో అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేయించారు.

●మల్యాల: మండలంలోని పోతారంలో కిశోర బాలికలకు, తల్లులకు ఎనీమియా, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో అరవింద, సూపర్‌వైజర్ శారధ పాల్గొన్నారు.

●రాయికల్ గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవడంతో రక్తహీనత ముప్పు తగ్గించుకోవచ్చునని సీడీపీవో మమత అన్నారు. రామాజీపేట ప్రాథమిక పాఠశాలలో పోషణ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా 0-6 సంవత్సరాల్లోపు పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే వైద్యుడు నరేందర్, డాక్టర్ రేవతి, ఫార్మాసిస్ట్ గౌతమి, సూపర్‌వైజర్ పద్మావతి, ఏఎన్ఎం జలజ పాల్గొన్నారు. ఇటిక్యాల అంగన్‌వాడీ కేంద్రంలో హ్యాండ్ వాష్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఎద్దండి అనురాధ పాల్గొన్నారు.

●కథలాపూర్: సమతుల్య ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షైమదీ బేగం పేర్కొన్నారు. తక్కళ్ళపల్లి, తాండ్య్రాల గ్రామాల్లో చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు రాణి, లక్ష్మీ, పద్మాంజలి, వనిత, రమ, వరలక్ష్మీ, స్వరూపారాణి, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

●మల్లాపూర్: పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్య సమస్యలు తలెత్తవని ఐసీడీఎస్ సీడీపీవో మణెమ్మ అన్నారు. సంగెం్శ్రీరాంపూర్ గ్రామంలో అంగన్‌వాడీ టీచర్లతో కలిసి అవగాహన కల్పించారు.

●కొడిమ్యాల: నల్లగొండ అంగన్‌వాడీ కేంద్రాలలో చేతులు కడుక్కోవడంపై చిన్నారులకు, తల్లులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధారాణి, అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నాగేంద్రమ్మ, సంఘశీల పాల్గొన్నారు.

ఉద్యోగుల అక్రమ నియామకంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగుల అక్రమ నియామకంపై మున్సిపల్ మాజీ కౌన్సిలర్ అనుమల్ల జయశ్రీ కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. మున్సిపల్‌లో ఇంజనీరింగ్ సెక్షన్‌లో వాటర్ సప్లయ్ విభాగంలో ఒక్కొక్కరి వద్ద 2 లక్షలు తీసుకుని నియామకం చేసినట్లు కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతే కాకుండా శానిటరీ విభాగానికి చెందిన పలు వాహనాలు కనిపించకుండా పోయాయని వాటిపై విచారణ జరపాలని ఆమె కోరారు.

విద్యా విధానంలో సమూల మార్పులు

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): భారతీయ శిక్షణ మండల్ 56వ ఆవిర్భావ వేడుకలు పట్టణంలోని స్థానిక రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సంఘ తెలంగాణ ప్రాంత పర్యవేక్షకులు దేవరాజు నాయక్, ఉస్మానియా వర్సిటీ విభాగ పర్యవేక్షకులు మంతెన సతీష్, ప్రధానవక్త సాయి మధుకర్‌లు మాట్లాడుతూ విద్యాద్వారా దేశంలో పునరుజ్జీవనంకు పాటుపడడమే సంస్థ లక్ష్యమని దేశంలో సుమారు 28 రాష్ట్రాల్లో 700 జిల్లాలో సంస్థ కార్యకలాపాలు విస్తరించి ఉన్నాయన్నారు. విద్యా విధానంలో సమూల మార్పుల కోసం కృషి చేస్తున్నామన్నారు. త్వరలోనే భారత దేశం విశ్వగురువుగా అవతరిస్తుందని, విద్యావ్యవస్థలో పలు మార్పులు చేయాలని బ్రిటీష్ విద్యావిధానాన్ని నేటికీ అనుసరించడం దేశానికి ఒక శాపం అన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ కొక్కుల రాజేందర్ మాట్లాడుతూ విద్య యొక్క అంతిమ లక్ష్యం జ్ఞాన సముపార్జన అని, కానీ నేటి యువతరం ఉద్యోగ సాధనకే ప్రాధాన్యత ఇస్తూ సరైన దిశలో జ్ఞాన సముపార్జన చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామానికి చెందిన తాళ్ల తిరుపతిగౌడ్(47) అనే వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడని జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. తిరుపతి కొన్నిరోజులుగా మద్యానికి బానిసై ఈనెల 6న పురుగుల మందు తాగగా జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో గురువారం మృతిచెందాడు. మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

రాయికల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని గోనె నర్సయ్యకు చెందిన గొర్ల మందపై కుక్కలు దాడి చేయగా 10 గొర్రెలు మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. రైతును ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

నాటుసారా తరలిస్తున్న వ్యక్తుల పట్టివేత

రాయికల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట, మూటపెల్లి, వస్తాపూర్, తాట్లవాయి గ్రామాల్లో నాటుసారా రవాణా చేస్తున్నారనే సమాచారంతో ఎక్సైజ్ సీఐ సర్వేశ్వర్ ఆధ్వర్యంలో సిబ్బంది ఇద్దరు నాటుసారా తరలిస్తున్న వ్యక్తులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 10 లీటర్ల నాటుసారాతో పాటు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. తాట్లవాయి గ్రామానికి చెందిన బానావత్ శ్రీను నుంచి 5 లీటర్ల నాటుసారా, ద్విచక్ర వాహనం, వస్తాపూర్ గ్రామానికి చెందిన గుగులోతు వెంకటేష్ నుంచి 5 లీటర్ల నాటుసారా, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేస్తామని సీఐ సర్వేశ్వర్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై రాజేందర్, సిబ్బంది కిషోర్, రమేష్, కిరణ్, బీరయ్య, దేవేందర్‌లు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

మల్యాల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్‌కు చెందిన బత్తిని సంధ్య అనే యువతి అదృశ్యమైనట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లిపోగా పలు చోట్ల వెదికిన ఆచూకీ లభించకపోవడంతో యువతి తల్లి గురువారం యువతి తల్లి మంగ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పట్టుపగలు చోరీ

మల్యాల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల క్రాస్ రోడ్డుకు చెందిన సుంకె లక్ష్మి అనే మహిళ ఇంట్లో పట్టపగలు దొంగతనం జరిగింది. క్రాస్ రోడ్డు సమీపంలో ఇటీవల నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠాపన పూజలకు వెళ్లిన లక్ష్మి తిరిగి ఇంటికి వచ్చే సరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూస్తే 7.5గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.20వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు అహరించుకువెళ్లారు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

మిషన్ భగీరథ అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మిషన్ భగీరథ అధికారుల పని తీరుపై కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండలం ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ గ్రామాలలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనుల వివరాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారులు తెలిపిన వివరాలను తప్పుపట్టిన ఎమ్మెల్యే అధికారుల పనితీరు మార్చుకోకుంటే గ్రామీణ ప్రాతం ప్రజలు నిలదీస్తారని హెచ్చరించారు. వేసవి కాలంలో ప్రతి ఇంటికి తాగు నీరు అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలను అందించి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, మండల విద్యాధికారి నరేశంలతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

'రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యం'

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జు జువ్వాడి నర్సింగ రావు అన్నారు. గురువారం మండలంలోని అయిలాపూర్, ధర్మారం గ్రామాలలో జై బాపు జై భీమ్ జై సంవిదాన్ కార్యాక్రమంలో భాగంగా గ్రామంలోని అంబేద్కర్ విగ్రహంకు నివాళ్లను అర్పించి కాంగ్రెస్ నాయకులు ర్యాలీలను నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న జువ్వాడి నర్సింగ రావు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చరిత్రను కూడ విస్మరించిందన్నారు. రాజ్యాం పరిరక్షణ కొరకు కాంగ్రెస్ చేస్తున్న జై భీమ్ జై బాపు జై సంవిదాన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాట్లు తెలుపుతున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మెన్ పన్నాల అంజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొంత రాజం, నగునూరి గంగాధర్ గౌడ్, లింబాద్రి, సంజీవ రెడ్డి, రంజిత్ కుమార్, లింగంపల్లి అంజయ్య, మంచోడు రాజేందర్, వేల్పుల రాజులతో పాటు పలువురు పాల్గొన్నారు.

●మల్లాపూర్, ఏప్రిల్, 10 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగం అంత్యంత పవిత్రమైనదని కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. గురువారం మండలంలోని మొగిలిపేట గ్రామంలో కాంగ్రెస్ నాయకులు నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిధన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు జలపతిరెడ్డి, రమేష్, సురేష్, తుక్కన్న, గణేష్, శ్రీనివాస్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

స్లాట్ బుకింగ్ ద్వారా మొదటి రిజిస్ట్రేషన్

జగిత్యాల, అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల సబ్ రిజిష్టార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ పద్ధతి ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ గురువారం ప్రారంభించినట్లు జగిత్యాల సబ్ రిజిష్టార్ సుజాత తెలిపారు. ఈ పద్ధతి ద్వారా స్లాట్ బుక్ చేసుకున్న అరగంటలోపు మొత్తం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అయిందని ఆమె తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఉరుకులు పరుగుల జీవన విదానంలో ఈ ప్రక్రియ వల్ల చాలా వెసులుబాటు కలుగుతుందని క్రెడియ తెలంగాణ వైస్ ప్రెసిడెంట్ చల్లా గోవర్ధన్ రెడ్డి అన్నారు. ఉమ్మడి కరీంనగర్ స్టాంప్స్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు. ఇప్పుడున్న ఉరుకులు పరుగుల జీవితంలో స్లాట్ బుకింగ్ ద్వారా నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగియడం చాలా వెసులు బాటుగా ఉందని క్రిడియా తెలంగాణ వైస్ పెసిడెంట్ చల్లా గోవర్ధన్ రెడ్డి తెలిపారు,

గాయత్రి బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): గాయత్రి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు మరింత ఉన్నతిని సాధించాలని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. జిల్లా కేంద్రంలో గాయత్రి బ్యాంకు ప్రధాన కార్యాలయంలో అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని పురస్కరించుకొని వినియోగదారుల సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా సహకార అధికారి మనోజ్ కుమార్ మాట్లాడుతూ బ్యాంకు అభివృద్ధి వెనుక సీఈవో, సిబ్బంది చేస్తున్నకృషి పట్టుదల అభివృద్ధికి ప్రధాన కారణం అన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ రాం కుమార్ మాట్లాడుతూ ఖాతాదారులకు సేవలు అందించడం, సమస్యల పరిష్కారంలో గాయత్రి బ్యాంకు అగ్రస్థానంలో నిలిచిందన్నారు. బ్యాంకు సీఈవో వనమాల శ్రీనివాస్ బ్యాంకు ప్రస్థానం, అభివృద్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో గాయత్రి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు జీఎం(అడ్మిన్) శ్రీలత, సహకార శాఖ కార్యాలయ సూపరిండెంట్ సుజాత పాల్గొన్నారు.

శ్రీకృష్ణ యాదవ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్

రాయికల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటిక్యాల గ్రామ శ్రీ కృష్ణ యాదవ సంఘం అధ్యక్షునిగా భూషణవేణి శ్రీనివాస్ యాదవ్ ఎన్నికయ్యారు. గ్రామంలో గురువారం శ్రీ కృష్ణ యాదవ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా నేతుల సోమయ్య యాదవ్, కోశాధికారిగా పంచతి గంగాధర్ యాదవ్, సలహాదారులుగా నేతుల రాజేందర్ యాదవ్, కొక్కెర చంద్రశేఖర్ యాదవ్‌ను ఎన్నుకున్నారు.

కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రంగరావుపేట గ్రామంలో డీసీఎమ్ఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని డీసీవోకు రైతులు వినతి పత్రం అందజేసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీసీఎమ్ఎస్ ద్వారా గతంలో గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పలు కారణాల వల్ల కొనుగోలు కేంద్రాన్ని తొలగించడం జరిగింది. దీంతో గ్రామంలోని రైతులు పండించిన పంటలను విక్రయించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి గ్రామంలో మళ్లీ డీసీఎమ్ఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డీసీఎమ్‌ను కోరి వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకే కొనుగోళ్ల కేంద్రాన్ని సొసైటికి మార్చడం జరిగిందని, తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపాడని రైతులు తెలిపారు.

లబ్ధిదారులకు శిక్షణ

కొడిమ్యాల, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారీ సంస్థ ద్వారా యూనిట్ మంజూరైన లబ్ధిదారులు వ్యాపారంలో అభివృద్ధి చెందాలని జిల్లా అదనపు డీఆర్‌డీవో మండల ప్రత్యేక అధికారి చరణ్‌దాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయంలో కొడిమ్యాల, మల్యాల మండలాలకు చెందిన పీఎంఎఫ్ఎంఈ లబ్దిదారుల మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డీపీఎం వెంకటేశం, శ్రీనిధి రీజినల్ మేనేజర్ రామ్‌నారాయణ, జిల్లా ఏపీఎం హుస్సేన్, జిల్లా ట్రైనర్ రామక్రిష్ణ, మండల ఇన్‌చార్జ్ ఏపీఎం పద్మ, సిబ్బంది, లబ్దిదారులు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణంతో పాటు మండలంలోని వివిధ ప్రాథమిక పాఠశాలలను ట్వీనింగ్ ఆఫ్ స్కూల్ బృందం సభ్యులు సందర్శించారు. మండలంలోని మోహన్‌రావుపేట, కోరుట్ల లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను సందిర్శంచి వాటిలో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే విధంగా ఏర్పాటు చేసిన వనలరలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి నరేశం, కాంప్లెక్స్ ప్రదానోపాధ్యాయులు ఆనందరావు, భూమయ్య, ఇంచార్జు ప్రదానోపాధ్యాయురాలు సుమలత, ప్రాథమిక పాఠశాల ప్రదానోపాధ్యాయులు నాగుల నరహరి, పార్హానా బేగం, పోగుల అంజయ్య, ఉదయ రూప, వాజీద్, అజం, సీఆర్‌పీలు గంగాధర్, దేవేందర్, జ్యోతి, మన్విితలు పాల్గొన్నారు.

తాగు నీటికి ఇబ్బంది కలగకుండా చర్యలు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


వాటర్ ట్యాంకర్లను ప్రారంభిస్తున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి నియోజకవర్గంలో తాగు నీటి కోసం ఇబ్బందులు కలుగనీయకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ధర్మపురి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద తాగు నీటి అవసరాల కోసం కొనుగోలు చేసిన రెండు నూతన వాటర్ ట్యాంకర్లను ఆయన గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను గెలిచిన వెంటనే జిల్లా కలెక్టర్, అధికారులతో ధర్మపురి పట్టణంలో తాగు నీటి శాశ్వత పరిష్కారం కోసం సమావేశం జరిపి చర్చించడం జరిగిందని ఆయన తెలిపారు. అనంతరం ఆయన పట్టణంలోని కమలాపూర్ ఇందిరమ్మ కాలనీలో నిర్మాణ దశలో ఉన్న బస్తీ దవాఖాన, చిల్డ్రన్ పార్కులను పరిశీలించారు. అమృత జల్ పథకం కింద చేపట్టిన నల్లా పైపు లైన్ పనులను ప్రారంభించి, జరుగుతున్న పనుల వివరాల గురించి అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, మున్సిపల్ కమీషనర్ కల్లెడ రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి

వెల్గటూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నిరుపేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందించే ప్రభుత్వ పాఠశాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఎంపీడీవో వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మండలం లోని పైడిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ముద్రించిన ముందస్తు బడి బాట కరపత్రాన్ని గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపి ప్రభుత్వ పాఠశాలల్లో అందించే ఉచిత నాణ్యమైన విద్యతో పాటు వివిధ రకాల సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ప్రభాకర్, పైడిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తులసి ఆగమయ్య, కార్యాలయ సిబ్బంది ప్రసాద్, వెంకటేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు

నర్సరీల నిర్వహణపై నిర్లక్ష్యం తగదు


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో గంగాధర్

సారంగాపూర్, ఎప్రిల్, 10 (ఆంధ్రజ్యోతి) గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల నిర్వహణపై నిర్లక్ష్యం వద్దని ఎంపీడీవో గంగాధర్ అన్నారు. మండలంలోని కోనాపూర్ గ్రామంలో ఉన్న నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కలు ఎండి పోకుండా చూడాలని సూచించారు. అధిక సంఖ్యలో ప్రజలను ఉపాధి పనులకు వచ్చేల చూడాలని అన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించి పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచా యితీ కార్యదర్శి ఫీల్డ్ అసిస్టెంట్, అంగన్‌వాడీ టీచర్, పలువరుఉఁ చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

కొడిమ్యాల, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): సీనియర్ న్యాయ వాది రాచకొండ శ్రీరాములు ఇటీవల జగిత్యాల బార్ అసోసి యేషన్ అధ్యక్షుడిగా ఎన్నిక కాగా గురువారం కొడిమ్యాల మండల బీజేపీ నాయకులు శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ శ్రీరాములు న్యాయవాదిగా ప్రజల మెప్పు పొందాడన్నారు. మరిన్ని ఉన్నత పదవులు అదిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ సీనియర్ నాయకులు అక్కపెల్లి రవీందర్, మెరుగు కిషన్‌గౌడ్, బూస గంగాధర్, దుర్శెట్టి క్రిష్ణ, చెన్న దేవెందర్ ఉన్నారు.

సన్న బియ్యం పంపిణీ

గొల్లపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలం బీబీరాజ్ పల్లె గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంను ఏఎంసీ డైరెక్టర్ ఒరగంటి తిరుపతి ప్రారంభించారు. కార్యక్రమంలో పెద్ది సాంబయ్య, కాసార్ల కళ్యాణ్, పెద్ది శేఖర్, దావ మోహన్, ఉప్పు శ్రీను, మాలోతు నరేష్, ఓరగంటి మహేష్, సరసాని భూమరెడ్డి, స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవం

వెల్గటూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలం లోని రాజక్కపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి బోనగిరి ప్రభాకర్ మాట్లా డుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి భవిష్యత్తులో మంచి స్థాయికి చేరుకో వాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గంగరాజు, పాల్గొన్నారు.

ఘనంగా హనుమత యాగం

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి పట్టణంలోని స్వయంభూ హనుమాన్ దేవాలయంలో హనుమత యాగం నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలను నిర్వహించిన అలయ అర్చకులు లక్ష్మి గణపతి, దుర్గామాత, లక్ష్మీనారాయణ, మృత్యుంజయ, మన్యుసూక్త హనుమత యాగాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దీక్షపరులు సంజీవ్, మహేష్, కిశోర్, భూపతి, సురేందర్, రాజేష్, ఉదయ్ ఉన్నారు.